# వెలుగు

తలపైకెత్తి ఆకాశం దిక్కు చూశాడు పోచయ్య. అక్కడక్కడ మబ్బు తెరలు కమ్ముకొనున్నాయి. చల్లగా గాలి వీస్తుంది. గాలికి మేఘాలు విడిపోతున్నాయి. మరికొంత సేపట్లో ఆకాశం నిర్మలంగా తయారైంది. "ఇగ ఫరవాలేదు వానేం రాదు మందెయ్యాలె" అనుకున్నాడు. గంపలో వున్న యూరియాను చిన్న గమాల్లోకి తోడాడు. గమాల చేతితో పట్టుకొని పొలంలోకి దిగాడు...రోగం తగిలి పొలమంతా ఎర్రగావుంది. . ఈ మందేత్తె పొలం పచ్చగైతది రెండు పన్నెత్తె పట్టెడన్ని వడ్లు మా రాల్తయి. తనలో తాననుకుంటూ పొలంలో తిరుగుతూ మందు జల్లుతున్నాడు. గమాల్లోని మందయి పోగానే గంపలోని మందు మరింత తెచ్చి చల్లుతున్నాడు పొలం మోకాలు క్రింది వరకు దిగబడుతుంది. బలవంతంగా కాళ్లు పైకి లేపుతూ ఆయాసంగా అడుగులేస్తూ తన పని కానిస్తున్నాడు. సగం వరకు చల్లడం పూర్తయింది. ఒడ్డుపై కూర్చున్నాడు పోచయ్య. సాయంత్రం దాదాపు ఐదు గంటల టైమవుతుంది. పొద్దుపోతంది. జెప్పన మందేసి పోవాలె అనుకుంటూ లేచి నిల్చున్నాడు.. ఆకాశం దిక్కు చూసాడు. అంతవరకూ నిర్మలంగా వున్న ఆకాశంలో ఇపుడు మేఘాలు అటూ ఇటూ పరుగిడుతున్నాయి. కొంచెం జంకాడు పోచయ్య. వానత్తె మందంత నష్టమయితది. ఏం జెయ్యాలె అనుకుంటూ పైకే చూస్తున్నాడు. మళ్ళీ మేఘాలు విడిపోతున్నాయి ఇగ వానేం రాదు అనుకొని గమాల్లోకి మందు తీసుకొని పొలంలోకి దిగాడు పొలమంతా తిరుగుతూ మందు చల్లడం పూర్తి చేశాడు. ఒడ్డుకొచ్చి నిల్చున్నాడు. తృప్తిగా పొలం దిక్కు చూసాడు. ఆకాశం దిక్కు మళ్ళీ చూశాడు. ఆకా

శం నిండా నల్లని మేఘాలు...కొంచెం వణికాడు.మబ్బు కమ్ముకత్తంది వానచ్చేటట్టుంది .. ఏమయిద్దో. అనుకుంటూ కాలువలో కాళ్ళు చేతులు కడుక్కున్నాడు. టప్ మని ఓ చినుకు మీద పడింది గబ గబా పొల మంతా తిరిగి ఓ మడిలో నీరు మరో మళ్ళోకి పోకుండా మన్ను వేసిన చోట్లలో మరింత మట్టేసాడు చేతులు కడుక్కున్నాడు. టప్ టప్మని అంటూ చినుకులు రాలడం ప్రారంభమయింది. ఆకాశం దిక్కు చూసిన పోచయ్య ఇక వాన రావడం తప్పదని నిర్ధారించుకున్నాడు. "నీయవ్వ వాన రాదనుకొని మందేత్తి. వాన రాకడ పానం బోకడ ఎవ్వలకు తెలు వది. మందు దండుగయినట్టే తనలో తానే గొనుక్కున్నాడు టప్ టప్ టప్ మని చినుకులు రాలుతున్నాయి. గమాల గంపలో పడేసాడు గొం గడి కోలాట మేసుకొని తలపై నుండి పేసుకున్నాడు. గంపను తలపై పెట్టుకొని పొలాల ఒడ్లపై నుండి నడుస్తున్నాడు. టప్ టప్.. టప్ చినుకులు పడటం ఎక్కువయింది. "మూడు గుంచాల మందు తొంబై రూపాయలు పెట్టి తెత్తి, సావుకారియ్యనన్నా బతిమిలాడి తీసుకత్తి. మం దంత మంట్లె గలసి పోతదిగ అనుకున్నాడు ఛర్ ... ఛర్ మంటూ ఉరుము. ఛక్... ఛక్ అని మెరెపు, అర్జునా— అర్జునా...అర్జునా మూడు సార్లు అన్నాడు పోచయ్య. బురదగా వున్న రోడ్లపై నుండి కాళ్ళు జారుతున్నాయి. జారకుండా నిలదొక్కుకుంటూ మెల్ల మెల్లగా నడుస్తున్నాడు చినుకులుగా ప్రారంభమయి వాన కురుస్తుందిప్పుడు ... ఎంత పాడు గడియల కొమటయినె దగ్గర మందు దెచ్చినోన్న .. ఇదు వరకే బాకున్ననని ఏడ్చుకుంటూనే ఇచ్చిండు అటు పొలం లేసుడా ల్సంలేదు. వాన మొదలయిపాయె...ఒక్క రొండు మూడు గంటలాగినా కొంత మందన్న వరికి పట్టేది. నసీవ పాడుగాను. విచారిస్తూ నడుస్తు న్నాడు పోచయ్య. ప్రక్కలకు చూసాడు పచ్చగా పొలాలు మరికొన్ని రోగాలు తగిలి ఎర్రబడున్నాయి ఆకులు మాడిపోయి వెల వెలబోతు

న్నాయి... యాల్లకు మందెయ్యకుంటే గట్లుంటయి పొలాలు. మంచిగుం దన్నని మందేత్తినేమో గిట్ల మన్నుపాలు గావట్టె ఎన్ననుకుంటేంది? ఆ నారాయణ మూర్తెత్తుకోందేం గాదు? అయినె ముందు మనమెంత టోళ్ళం. ఆలోచిస్తూ నడుస్తున్న పోచయ్య కాల్జారింది. పొలంలోఅడుగు పడింది. కాలు పైకి తీసి ఒడ్డుపై నుండి నడుస్తున్నాడు. చక్...చక్ అంటూ పెద్ద ఉరుము ఎక్కడో పిడుగుపడ్డ ధ్వని అర్జెనా అర్జెనా .. అర్జెనా అని మూడు సార్లు గట్టిగా అన్నాడు.

ఏం వానలో ఏమో? అత్తయనుకున్నప్పుడు రావు... రాదనుకుం టత్తయి ఓసారోసారి. ఆరుద్ర వచ్చినా ఒక్క సినుకన్నపడది. ఒక్కొ క్కసారేమో రోహీన్లనే మునిగిపోయినట్టు పెద్దపెద్ద అనలు పడుతయి. ఒక్క సినుక్కోసం ఎయ్యి కండ్లతో నెన్నిసార్లు ఎదురుసూల్లే. సినుకు పడ్డదంటెంత పొంగిపోలె? ఆయెటె పూనిందంటే ఎడ్లకో నాగలి గట్టు కొని ఉరికిరికి దున్నలే...? తనలో తానే అనుకుంటున్నాడు పోచయ్య. వాన జోరెక్కువయింది గొంగట్లో నుండి నీళ్ళు కారుతున్నాయి. గంప తలపై నుండి బోర్లించుకొని గమాల చేతితో పట్టుకుని నడుస్తున్నాడు. గొంగలి రెండంచులు కలిపి దగ్గరికి పట్టుకున్నాడు. పొలాలుదాటి తోవలో కొచ్చాడు. తోవనిండా బురదా...నీళ్ళు...రాళ్లు . కంప.. నీళ్ళలోంచి మెల్ల మెల్లగా నడుస్తున్నాడు. ముందు పశువులు నడుస్తున్నాయి. బొ బొ అంటు వాటి వెనుక పశువులగాచే పిల్లలు పరుగెడుతున్నారు. పిల్లలదిలిం చగానే తోకలు పైకెత్తి పరుగిడుతున్నాయి వెనుక గబగబా నడుస్తూ పశువుల మంద ప్రక్కకు జరిగాడు పోచయ్య. వాటి కాళ్ళ తొక్కిడితో చిమ్మిన నీళ్లు అతనిపై పడుతున్నాయి. గొంగళి పూర్తిగా తడిచి ఒంటి కంటుకుంటుంది. తలపై వున్న రుమాలు కూడా తడయింది. చల్లగా చలి, దురదగా వుంటే తలనోసారి గోక్కున్నాడు. వానా వానా....వానా పల్లప్పా. చేతులు చాపూ చెల్లప్పా. పాడుతూ పరుగిడుతున్నారు పిల్లలు

వానలు కురవడం ఆలస్యమయితే కప్పల పెళ్ళిళ్లు చేయడం. హరికథ అయ్యవారితో విరాటపర్వం కథ చెప్పించడం పోచయ్య కళ్ళ ముందు కదలాడుతున్నాయి. విరాటపర్వం కథలో అర్జునుడు విరాటరాజు గోవులమలిపే ఘట్టం భీముడు కీచకున్ని చంపిన ఘట్టం. పోచయ్యకు జ్ఞాపకమొచ్చాయి. పుణ్యాత్ములు పాండవులేడుంటే అడ వానలు మస్తుగ పడుతాయట మంచిగ పంటలు పండుతాయట — కరువన్నదే ఉండదట .. మనసులోనే వాళ్ళకు దండం పెట్టుకున్నాడు. అంబా అని రంకెవేసి తోక పైకెత్తి కొమ్ముల్తో మట్టను చిమ్ముతుంది కైలికోడె ..దాని కాపరి వచ్చి కట్టెతో కొట్టాడు. అది పొగరుగా వెనుకకు చూసి పరుగెడుతుంది అసలేట్లె (ఆశ్రేష కార్తి) ముసలెడ్లు ర కె తీత్తయంటరు. పచ్చగడ్డి బాగా తింటున్నాయి ఉరుకులాడుతున్నాయి కోళ్ళాగెలు అనుకున్నాడు పోచయ్య. ఓ కాలువడ్డమొచ్చింది అందులోకి దిగి నడుస్తున్నాడు ఎడ్లమంద బర్ల మంద దాటిపోయింది చిల్లర పశువులొక్కొక్కటి వస్తున్నాయి. మామూలు సమయంలో జానెడు లోతుండే ఆ కాలువిప్పుడు మోకాళ్ళు దాటి పారుతుంది — ఒక చేత్తో తలపై వున్న గంపను, మరో చేత్తో దోతిని. గొంగళ్ళి పైకి మలిచి గమాలతో నడవడానికి సతమతమవుతున్నాడు ..

"ఏంది తాత గీ వానలెటో పోయినవు — ? పదిహేనేళ్ళ పశువుల కుర్రాడు దగ్గరి కొస్తూ అడిగాడు —

"పొలానికి మందేత్తనని పొయిన నేనచ్చినప్పుడు మొసులసలే లేదు పొలంల మందు పడ్డంక కుండపోత కురువవట్టె" అన్నాడు పోచయ్య.

ఆ వయసులో అంత దూరం నడుస్తూ పోవడం వ్యవసాయప్పని చేయడం చూస్తున్న ఆ కుర్రాడికి పోచయ్యపై జాలి కలిగింది ..

"మందు దండుగయిద్దేమొ తాత? మనకు బాకి లేదనుకోవలె,, పట్టు వేదాంతిలా అన్నాడు కుర్రాడు —

"పొలాలొడ్ల మీది కెళ్ళి నీళ్లు వారుతున్నాయిగ దండుగ్గాకుంటే మయిద్దీ? ఇగ నేసేదేముంది...?" అన్నాడు పోచయ్య.

ఆ కుర్రాడితో సమానంగా నడవటానికాయాసపడుతున్నాడు పోచయ్య. అది గమనించాడు కుర్రాడు—

"నేం బోత తాత మెల్లగా రా..." అని "బొ బొ" అటూ పశువుల తోలుకొని వెళ్ళిపొయాడు—

పూర్తిగా తడిచి పోయిన పోచయ్య శరీరం నుండి సన్నగా వణుకొస్తున్నది. పైనుండి ప్రవాహపు మోత జోరుగా వినబడుతుంది. వర్షం ధారాపోతంగా కురుస్తూనే వుంది. పోచయ్యలో ఎన్నో ఆలోచనలు.

"నాయిన్న పొంగ నాలుగెకరాలు పంచిచ్చే మంట్లె మన్నైన, దుబ్బలో దుబ్బై బొర్లి ఎవుసాయం జేత్తి, ఎవుసంలేముంది దుబ్బా? కూలన్న పెట్టపాయె. ఎంత కష్టమొచ్చినా బూమి నమ్మద్దనుకుంటి. దాన్ని నిలుపుకుంటానికి గొడ్డోలె సాకిరి సేత్తి రాత్రి లేపాయె, పగల్లేపాయె అయిన ఇద్దరాడి పొల్లగండ్ల లగ్గాలకు ఓ ఎకురం పోనేపాయె. కొడుకెదిగచ్చిండు ఇగ నాకు ఢోక లేదనుకొంటి—ఆనిగ్గూడ లగ్గం జేత్తి. సిన్నప్పడాన్ని ఒళ్ళెపెట్టుకొని సాత్తి. కాకి గద్దగొట్టకుంట కంటికిరెప్పలెకా పాడుకుంటి. ఎదిగిన కొడుకు మీన ఆసెలు పెట్టుకొని బతికితి— నా కష్టాలు గట్టెక్కుతాయనుకొంటి కని ఏమాయె? నారాత పాడుగాను జట్టరాత దుక్కచ్చుకుంటి నా కొడుకు నాకంటెత్తున్న కొడుకు నన్ను నడేట్ల ముంచిపాయె కడుపుల పెట్టుకొని సాదిన కొడుకు మంట్లె గలిసిపాయె...నా సేతులల్లో పెంచుకున్న కొడుకును దుబ్బ పాజేత్తి...ఆ రాత్రి ఆ జట్ట రాత్రి అద్దువరాత్రి పొయ్యి పొయ్యచ్చి పండుకున్న కొడుకును లేపకున్న మంచిగుండు ఎడ్లకు మాతెయ్యన్నని నాకు గడ్డివాము గుంజ సాతగాదని కొడుకును లేపి తోల్తి. ఎడ్లకు మాతేసచ్చిన కొడుకు కాలునేదో కుట్టినట్టనిపించిందే నాయన్నా అన్నాడు—దీపం ముట్టిచ్చి కాలు జూత్తి చిన్న

కాటుంది. పాము గుట్టిందని మొత్తుకుంటి. కొడుకు నోట్లో నుంచి నురుగులు రానేవట్టె—ముసల్దిలబదిబ మొత్తుకొనవట్టె. మందు రాయపెట్టి ఏంగాపాయె ..రాళ్ల మందేసి మంగయ్య దొర దగ్గరికత్తనని మొక్కించితి తగ్గకపాయె. మంత్రమేపిత్తి నురుగులెక్కోనేగావట్టె ఆఖరుకు డాకటరును గూడ పిలిపిచ్చి సూడేపిత్తి తగ్గకనేపాయె. నోట్లో నుంచి నురుగులు కుప్పలోలె రావట్టె "నాయనా నేం జచ్చిపోతన్ననే. అని పానమిడిసె కొడుకు సెట్టంత కొడుకును పోగొట్టుకొని ముసల్ది నేను ఒర్రొర్రి సత్తిమి ఇద్దరం నాలె పడ్తిమి. ఆడ్నెళ్ళ దాక ఏం దిన్నమో లేదో తెలువది యాదాగినంక కోడలు పోరి ఐదేండ్ల పొల్లగాడుండగ గూడ ఇంకొగన్ని సేసుకునె పోచయ్య కళ్ళముందు కన్నకొడుకును తన స్వహస్తాలతో మట్టిలో కలిపిన దృశ్యాలు కళ్ళవెంట కుంభవృష్టిని మించిన నీరు. కడుపులో ఉప్పెనను మించిన కల్లోలం..

కొడుకును కోల్పోయి ఐదేళ్ళెలా గడిపాడో తెలియదతనికి "పాపిష్టి బ్రితుకు బతుకవడ్తి నన్ను గొంచపొయ్యి బతికే పొల్లగాన్నుంచకపాయె భగవంతుడు ఆ దేవునిగ్గూడ గురి మరి యాదలేదు కాల్లెకు పోయెటోన్నేమో ఉంచుతడు. నాల్గు దినాలు బతికెటోన్నేమో గొంచవోతడు ఏం దేవుడో ఏందో? పాపపు ముండ కొడుకుల నుంచవట్టె నా కొడుకు పుట్టి బుద్దెరిగినప్పట్నుంచి ఎవ్వాల జోలికన్న పెయిండా? తన పనేందో, తనేందో నన్ను బంగారమోలె సూసుకునే? పని ఎక్కువ జెయ్య నియ్యకపాయె. మంచోల్లనే జెప్పన గొంచవోతడు దేవుడు అళ్ళంటె ఎక్కో ప్రేముంటదేమొ? నాకు కొరివి పెడతడనుకుంటే ఆన్నె బూడిద సెయ్య వల్సవచ్చె నాకు" తనలో తానే గొణుక్కున్నాడు పోచయ్య. కళ్ళవెంట కారే నీటిని తుడుచుకున్నాడు.

వర్షమింకా కురుస్తూనే వుంది...ఊళ్లోకి ప్రవేశించాడు. చిమ్మ చీకటిగా వుంది వణుకుతూ కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరుకున్నాడు. భర్త

కొరకెదిరి చూస్తున్న పోచయ్య భార్య. ఏంది గింత సేపాయె అసే పోతివి మందు నాశినమయినట్టేనా—? అంది. "పోంగ మొగులె లేదాయె గింత వాన గొట్టవట్టె మనదృష్టమెట్లుంటే గట్లయితది" అని గంప గమాల అరుగుమీద పెట్టాడు పోచయ్య. గొంగడి తీసాడు కోలాటం విప్పి జాడించాడు చిలకొయ్యకారేసాడు. రుమాలు, అంగి తీసి పిండి అరుగుపై వున్న దండెం బొంగుపై ఆరేసాడు ధోతి కూడ పిండి ఆరేసాడు. పొడి ధోతి కట్టుకున్నాడు. రాత్రి కప్పుకోవనావికుపయోగించే ధోతి కట్టు కోవడం వల్ల రాత్రికేం గప్పుకోవాలె అనుకున్నాడు.

"పొయ్యిల్ల అగ్గున్నాదె...సలివెడుతుంది' 'వణుకతూ అన్నాడు.

"ఇప్పుడే బువ్వొండించిన సెగ మావుంది రా" అని భర్తను లోపలికి తీసుకెళ్ళింది పొయ్యి ముందు కూచోని అరికాళ్ళు, చేతులు పొయ్యిపైకి చాపాడు.

"ఆయ్ ఎచ్చగుంది" అనుకుంటూ వేడయిన చేతులతో శరీరంపై కాచుకున్నాడు. వాన ఇంకా కురుస్తూనే వుంది. టక్ టక్ అంటూ చినుకులు గిన్నెలో పడ్డ చప్పుడు. వెనుకకు తిరిగి చూశాడు. పైనుండి ఊరుస్తున్న నీరు క్రింద పెట్టిన గిన్నెలో బొట్లు బొట్లుగా పడుతుంది. టప్ మంటూ ఓ చినుకు తలపై పడింది కొంచెం పక్కకు జరిగాడు. టప్టప్ ఉరుస్తుంది. ఓ గంజు దెచ్చి గిక్కడ పెట్టు ఉరుత్తంది " అన్నాడు ప్రక్కనే కూర్చున్న భార్యతో "ఎన్ని జాగల్లని గిన్నెలు పెట్నా.. లె? ఇల్లంత ఊరుసుడేనాయె? ఎండకాలం ఇల్లు గప్పియ్యమంటె కప్పియ్యక పోతివి''? అని ఓ కంచు తలె తీసుకొచ్చి పోచయ్య ప్రక్కన బెట్టిందతని భార్య.

"కప్పియ్యన్నను కుంటి గని గూన పెంకకు. సుతోరోనికి గలసి ఇన్నూర్రూపాలయితయన్న మోలె పైసల్లెవ్వని ఊకుంటె మల్ల ఆలోచించి కప్పిత్తామనె వరకు ఆనకాల మొచ్చె.. ఆనలు గొట్టనే వట్టె. ఎవ్వ

నప్పని తీరకపాయె ఏం బతుకులో..? అన్నాడు పోచయ్య.

పొయ్యి చల్లారింది. ఇక లాభం లేదని లేచాడు. చినిగిన షోలాపూర్ చద్దరు కప్పుకున్నాడు. అరుగు మీది కొచ్చాడు. నులక మంచం వాల్చుకొని కూర్చున్నాడు.

మా తాత ముత్తాతలు ఎవుసం సేసుకుంటూనే బతికిండ్రు. మా నాయిన్న గూడ మన్నుల మన్నాయె బతికిండు. పుట్టి బుద్ధెరిగి నప్పట్నుంచి నేం గూడ ఎద్దు ముడ్డి పొడుసుకుంటూనే బతుకుతున్న. ఒక్కడే కొడుకు నా వంశం ఉద్ధరిత్తడనుకుంటె నడుమంత్రాన పాయె. అరువదియేండ్లయినా పని దప్పదాయె. మంట్లెగలిసి పోయెదాక గిట్లనే బతుకుడయితది" పోచయ్యకు జీవితమంతా గాడాంధకారంగా అగుపడుతుంది. బయటున్న చిమ్మ చీకటికి తన జీవితానికేం తేడా కనబడటంలేదు. జీవితం గూర్చి ఆలోచిస్తున్న పోచయ్యకు పదేళ్ళ మనుమడు జ్ఞాపకమొచ్చాడు. కొడుకు జ్ఞాపకార్దంగా మిగిలిన ఆ పసివాడిపై అతనికి అంతులేని మమకారం...

''పొల్లగాడు పడుకున్నాడె? కనపడత లేదు'' అన్నాడు భార్యతో పోచయ్య.

,,నువ్వు రాంగానే అడుగుదామనుకున్న మర్చిపోయిన పొద్దుగూకిన నువ్వు రాకుంటె నేనద్దన్నా ఇన్క చెత్తిర్తి నట్టుకొని నిన్ను తీసుకత్తనని ఉరికిండు,,

“మంచిదానివే...గీ వానలెందుకు అవతలికి పోనిచ్చినవ్.. పసిపొల్లగాడు అని భార్యను కసిరాడు.

“నే వద్దంటె ఇన్నాడా? తాతను దీసుకత్తని చెత్తిర్తందుకొని చెంగోబిల్లన్నాడు'' అందామె.

పోచయ్య హృదయం ఆనందంతో ఉప్పొంగింది. తన కోసం పదేళ్ళ మనవడు పడే ఆరాటం అతన్ని కదలించింది. అతని కల్లు చెమ్మ

గిల్లాయి మాటి మాటికి బజారులోకి చూస్తూ మనువని కొరకెదురు చూస్తున్నాడు. "మనుమడు చదువుకొని పేరుకొస్తే అతన్లో ఎన్నో ఆలోచనలు ఆలస్యమవుతున్నకొద్ది అతన్లో ఆందోళన పెరుగుతుంది.

"జెప్పనత్తె మంచిగుండు పొల్లగాడు అనుకొని తీసుకనన్నత్త ఏడున్నడో.. అని లేచి నిల్చున్నాడు పోచయ్య.

ఆని కొరకు నువ్వు—నీ కొరకు అదు మంచిగనే వుంది కొద్దిగా గాదే అత్తడు" అందామె "మంచివానవే ఈ వాన లెక్కడ తిరుగుతండో" అని గొంగళి కప్పుకొని అరుగు దిగబోయాడు. ఛక్ ఛక్ మంటూ ఉరుము చక్ చక్ మని మెరుపు ఆ మెరుపు వెలుతురులో బజారులో నుంచి గొడుగు పట్టుకొని వస్తున్న మనవడు కనబడ్డాడు పోచయ్యకు. అతని కళ్ళలో వెలుగు గాఢాంధకారంలో మెరుపులా తన చిమ్మచీకటి బ్రతుకులో మనవడు వెలుగులా అనిపించాడు. మనవని తరంపై అతనికి ఆశగా వుంది...గబగబా వచ్చి అరుగెక్కిన మనవన్ని ఆప్యాయంగా హృదయానికత్తుకున్నాడు పోచయ్య.